



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి

జగనన్నకు చెబుదాం అర్జీలకు సత్వర పరిష్కారం

◆ సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి ◆ కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జగన్నకు చెబుదాం అర్జీలపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా తక్షణ పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం అనంతపురం నగరంలోని కృష్ణ కళామందిర్‌లో అనంతపురం అర్బన్‌కు సంబంధించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, ఆర్డీవో మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌పై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు లబ్ధిని చేకూర్చాలన్నారు. జగనన్నకు చెబుదాం టోల్ ఫ్రీ నెంబర్ 1902తో ఇంటి వద్ద నుంచే ఫోన్ చేస్తే ఫిర్యాదుదారు అర్జీని నమోదు చేసుకుని సంబంధిత జిల్లా, సంబంధిత గ్రీవెన్స్ పరిష్కరించే అధికారికి ఫిర్యాదును పంపుతున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా, మండల, సచివాలయ స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, ప్రస్తుతం ప్రతి వారంలో బుధవారం, శుక్రవారం రోజుల్లో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి, పిఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, ఆర్అండ్‌బి ఎస్ఈ ఓబుల్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా.. పూర్తవ్వని ఆధునీకరణ.!



◆ అసంపూర్తిగా జిబిసి, మిడ్‌పెన్నార్ సౌత్ పనులు ◆ పూర్తవని బిటిపి భూసేకరణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ప్రధాన సాగునీటి వనరుల్లో ఒకటిగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిధిలోకి వచ్చే రెండు ప్రధాన కెనాల్ ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభమై ఐదేళ్లు కావస్తున్నా అసంపూర్తిగానే ఆగిపోయి ఉన్నాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా గత కొంతకాలంగా పనులు ఆగిపోయి ఉన్నాయి. ఇప్పుడు చెల్లింపులు జరిగినా అన్‌సీజన్‌లో ప్రారంభించడానికి కాంట్రాక్టరు ముందుకొచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో మధ్యలోనే ఆధునీకరణ ఆగింది.

జిబిసి(గుంతకల్లు బ్రాంచ్ కెనాల్)

హెచ్‌ఎల్‌ఎంసి నుంచి పాల్తూరు వద్ద గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌గా విడిపోయి ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాలకు సాగునీటిని అందిస్తుంది. 59.40 కిలోమీటర్లు ఉండే ఈ కాలువ కింద 15,760 ఎకరాల ఆయకట్టు ఉంది. 2.77 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. ఇది పూర్తిగా దెబ్బతిని ప్రవాహ సామర్థ్యం మేరకు నీటి ప్రవాహం వెళ్లే పరిస్థితుల్లేకపోవడంతో 2016వ సంవత్సరంలో ఈ కాలువ ఆధునీకరించాలని నిర్ణయించి టెండర్లు పిలిచారు. రూ.234.67 కోట్లతో చేపట్టిన ఆధునీకరణ పనులు రూ.188.69 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. అయితే తక్కిన పనులు మధ్యలోనే ఆగిపోయాయి. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించలేదన్న ఉద్దేశంతో మధ్యలోనే పనులను ఆపేశారు. ఈ బిల్లులు ఇటీవలి కాలంలో వచ్చాయి. తరువాత పనులకు కూడా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగే అవకాశముందన్న ఉద్దేశంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. అధికారులేమో ఇప్పుడు అన్‌సీజన్ కాబట్టి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు అందించారు.

మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువదీ అదే స్థితి

మిడ్ పెన్నార్ నుంచి దక్షిణ కాలువ బయలుదేరుతుంది. ఇది కడప జిల్లా వరకు వెలుతుంది. సుమారు 44.44 కిలోమీటర్లు ఈ కాలువ వెలుతుంది. దీని కింద 22,708 ఎకరాల ఆయకట్టు ఉంది. 4.32 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. జిల్లాలో ఉన్న ప్రధాన కాలువల్లో ఇదీ ఒకటి. ఈ కాలువ ఆధునీకరణ కూడా రూ.509.16 కోట్లతో చేపట్టారు. మూడు ప్యాకేజీల్లో చేపిట్టిన ఈ పనులు ఇప్పటికి రూ.205.79 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. పెండింగ్‌లో ఉన్న పనుల్లో ప్రధానంగా ఐదు డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం జరగాల్సి ఉంది. కాని మధ్యలోనే ఆగిపోవడంతో డిస్ట్రిబ్యూటరీల నుంచి రైతులకు ఆయకట్టుకు నీరందడంలో సమస్య ఉంది. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పనులను కాంట్రాక్టరు ఆపారు. మిగిలిని పనులను పూర్తి చేయలేనని కాంట్రాక్టర్ అధికారులకు లేఖను అందజేశారు. అధికారులు ఇప్పటికీ దీనిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.



ఇంకా పూర్తవని బిటిపి భూసేకరణ

భైరవానితిప్ప ప్రాజెక్టు భూసేకరణకు జులై నెలలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా వచ్చిన సందర్భంలో రూ.80 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే ఈ నిధులు ఇంకా పూర్తి స్థాయిలో నిర్వాసితులకు అందలేదు. మొత్తం రూ.155 కోట్లు నిధులు విడుదల చేశారు. ఇందులో రూ.55 కోట్లు పనులకు రూ.80 కోట్లు నిర్వాసితులకు పరిహారంగా ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు చూస్తే 323 మంది రైతులకు రూ.29.6 కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యాయి. ఇంకా 642 మంది రైతులకు సంబంధించి రూ.45.21 కోట్లు నిధులు సిఎఫ్‌ఎంఎస్‌లో పెట్టినప్పటికీ ఇంకా రైతాల ఖాతల్లో జమవ్వాల్సి ఉంది.

ఆధునీకరణ పూర్తి చేయాలి

జిల్లాలో వర్షాపాతం తక్కువ కాబట్టి ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. కాలువల ఆధునీకరణ పూర్తి చేయాలి. జిల్లాలో ఏ ఒక్క సాగునీటి కాలువ కూడా సక్రమంగా లేదు. పూర్తిగా దెబ్బతిని ఉన్నాయి. అన్నీ కాలువలు కూడా పనులు ప్రారంభమై మధ్యలో ఆగి ఉన్నాయి. దీని వల్ల రైతులకు సక్రమంగా సాగునీరు అందటం లేదు. పైగా నీటి వృథా కూడా ఎక్కువగా ఉంటోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగునీటి కాలువల ఆధునీకరణ పూర్తి చేయాలి.

చంద్రశేఖర్‌రెడ్డి,
ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

నేడు యుటిఎఫ్ స్వర్ణోత్సవాల ర్యాలీ

హిందూపురం నుంచి ప్రారంభం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా యుటిఎఫ్ సర్ణోత్సవాలు తెలియజేస్తూ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా, అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్రారెడ్డి, కె.నాగేంద్ర, లింగమయ్య, గోవిందరాజులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ యుటిఎఫ్ 1974వ సంవత్సరంలో స్థాపించబడిందన్నారు. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీ చేపట్టి యుటిఎఫ్ ఆశయాలు సాధించిన లక్ష్యాలు, సాధించుకోవాల్సిన అంశాలపై రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, ప్రజలకు తెలియజేస్తూ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో హిందూపురం నుంచి చేపడుతున్న యుటిఎఫ్ సర్ణోత్సవాల బైక్ ర్యాలీకి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీ ప్రారంభిస్తారని తెలిపారు. ఆయనతో పాటు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్పతో, ఉమ్మడి జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. ర్యాలీ హిందూపురంలో ప్రారంభమయ్యే బైక్ ర్యాలీ పెనుకొండ, రాప్తాడు, మీదుగా అనంతపురం నగరంలోకి ప్రవేశిస్తుందన్నారు. పంగల్ రోడ్, కలెక్టరేట్, సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, టవర్‌క్లాక్, బళ్ళారి బైపాస్ మీదుగా ఉరవకొండ, గుంతకల్ చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి కర్నూలు జిల్లా పత్తికొండలో ప్రవేశిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సమస్యగా ఉన్న సిపిఎస్ రద్దు చేయాలనే డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. పాత పెన్షన్ విధానం అమలు చేసేంత వరకు శాంతియుతంగా కలిసి వచ్చే ప్రతి కార్యక్రమంలోనూ ఈ డిమాండ్‌తో నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు.

పసులూరులో ఉద్రిక్తం

◆ దళితుల శోభాయాత్రను అడ్డుకున్న పెత్తందారులు
◆ పోలీసుల సమక్షంలో ముగిసిన వినాయక నిమజ్జన కార్యక్రమం



పసులూరు వినాయక చవతి శోభాయాత్ర సందర్భంగా నెలకొన్న ఉద్రిక్తపరిస్థితుల నడమ సుంకలమ్మ ఆలయం వద్ద నిలిచిన విగ్రహం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల పరిధిలోని పసులూరు గ్రామంలో బుధవారం నాడు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వినాయక నిమజ్జనం సందర్భంగా దళితులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని గ్రామంలోని ఆలయం చుట్టూ తిప్పేందుకు పెత్తందారులు అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... పసులూరు గ్రామంలో వినాయక చవితి సందర్భంగా దళితులు వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం నిమజ్జనం సందర్భంగా శోభాయాత్రను చేపట్టారు. ఈ సమయంలో గ్రామంలో మిగతా విగ్రహాలను గ్రామంలోని సుంకలమ్మ ఆలయం చుట్టూ తిప్పి నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఆ విగ్రహాల మాదిరే దళితుల కూడా వారి విగ్రహాన్ని సుంకలమ్మ ఆలయం చుట్టూ తిప్పేందుకు వెళ్లారు. ఇందుకు గ్రామంలోని పెత్తందారులు అడ్డుకున్నారు. దళితుల విగ్రహం ఆలయం చుట్టూ తిప్పడానికి వీల్లేదంటూ అడ్డుపడ్డారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దళితులు వారి విగ్రహంతో ఆలయం వద్దనే కూర్చొన్నారు. గ్రామంలో నెలకొన్న ఈ పరిస్థితులను తెలుసుకున్న డీఎస్పీ గంగయ్య వెంటనే సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాల వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేశారు. శాంతియుతంగా నిమజ్జనం నిర్వహించుకోవాలని వారికి సూచించారు. అనంతరం రెండు వర్గాల వారితో మాట్లాడించి పోలీసులు దగ్గరుండి గ్రామంలోని అన్ని విగ్రహాలను చాగల్లు రిజర్వాయర్‌లో నిమజ్జనం చేయించారు.

దొరిగల్లులో విషాదం

◆ వినాయక చవితి వేడుకల్లో రెండు వర్గాల మధ్య ఘర్షణ
◆ దాడిలో వ్యక్తి మృతి
◆ 20 మందికి గాయాలు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల పరిధిలోని దొరిగల్లు బీసీ కాలనీలో వినాయక చవితి వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. రెండు వర్గాల మధ్య మొదలైన ఘర్షణ ఓ వ్యక్తి మృతికి దారి తీసింది. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... దొరిగల్లు బీసీ కాలనీలో వినాయక చవితిని పురస్కరించుకుని వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి 1 గంట సమయంలో దొరిగల్లు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వినాయక మండపం వద్దకెళ్లి రెండు ద్విచక్ర వాహనాల సైడ్ స్టాండ్‌ను సిమెంట్ రోడ్డుకు తాకిస్తూ నిప్పులు చిమ్మేలా విన్యాసం చేశారు. అక్కడే ఉన్న దొరిగల్లు బీసీ కాలనీకి చెందిన కొందరు ఆయువకుల్ని మందలించారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన యువకులు వేణు, వంశీ, పవన్, సింహాద్రిలను వెంటబెట్టుకుని మళ్లీ వినాయక మండపం వద్దకు వచ్చారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. ఈ ఘర్షణలో మంజుల అనంతయ్య(55)తో పాటు పలువురిపై కర్రలతో దాడి యువకులు దాడి చేశారు. ఈ ఘటనలో అనంతయ్య తలకు తీవ్రంగా గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనలో ఇరు వర్గాలకు చెందిన దాదాపు 20 మంది వరకు గాయపడ్డారు. ఘర్షణ విషయం తెలుసుకున్న ముదిగుబ్బ టౌన్ సిఐ హేమంత్ కుమార్ సిబ్బందితో కలిసి హుటాహుటిన దొరిగల్లు గ్రామానికి చేరుకున్నాడు. అక్కడ పరిస్థితిని చక్కదిద్ది, గాయాల పాలైన వారిని చికిత్స నిమిత్తం ముదిగుబ్బ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో నలుగురికి గాయాలు తీవ్రంగా ఉండడంతో వారిని మెరుగైన వైద్యం కోసం కదిరికి తరలించారు. మతుడు అనంతయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. బుధవారం ఉదయం ఘటనా స్థలాన్ని అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఎస్పీ శ్రీనివాసులు, సిఐ యతీంద్రలు పరిశీలించారు. కాగ ఈ ఘటనకు సంబంధించి 13 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



దాడిలో మృతి చెందిన అనంతయ్య (ఫైల్ ఫోటో)

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి : సిఐటియు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరాలో పని చేస్తున్న కార్మికులకు ఎస్ఎస్ఆర్ రేట్లతో చెల్లించాల్సిన వేతనాల్లో కోతలు విధించి కాజేసిన కాంట్రాక్టర్ కలాం నాయుడుపై చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నాడు అనంతపురం కృష్ణకళామందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందనలో కలెక్టర్ ఎమ్.గౌతమిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీరామ్‌రెడ్డి కార్మికులు మడకశిర డివిజన్‌లో వేతనాలు బకాయి పడ్డాయని తెలిపారు. పైగా ఒక్కొక్క కార్మికుని వేతనంలో రూ.2500 చొప్పున 120 మంది కార్మికుల డబ్బులు కోతలు విధించి కాజేశాడన్నారు. 120 మంది బోగస్ పేర్లతో కార్మికులుగా చూపించి ఒక్కొక్కరి పేరుతో నెలకు రూ.15 వేల చొప్పున వేతనాలు చెల్లించినట్లు చూపించి దండుకున్నాడని తెలిపారు. రెండు సంవత్సరాలుగా సుమారు రూ.6.50 కోట్లు కాజేశాడన్నారు. కాంట్రాక్టర్ అవినీతికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సహకరించారని తెలిపారు. అలాంటి అధికారులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. బకాయి పడ్డ వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్ డబ్బులు చెల్లించాలని కోరారు.



కార్మికుల వేతనాలు కాజేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సిఐటియు నాయకులు

అరాచక పాలనకు చరమగీతం పాడుదాం

◆ నేడు శాంతి ర్యాలీ ◆ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో వైసిపి సాగిస్తున్న అరాచక పరిపాలనకు చరమగీతం పాడుదామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పిలుపునిచ్చారు. బాబుకు తోడుగా ఒక నియంతపై పోరాటానికి మేము సైతం అంటూ టిడిపి అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఆధ్వర్యంలో కమ్మభవన్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 8వ రోజుకు చేరుకున్నాయి. జనసేన నాయకులు వరుణ్ నాయకత్వంలో దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి చంద్రబాబును కారాగారంలో పెట్టి రాక్షసానందం పొందుతున్నారని చెప్పారు. రాజకీయాలలో కక్ష సాధింపు వల్ల లాభపడిన వారు చరిత్రలో లేరన్నారు. జగన్ ప్రతి చర్యనూ ప్రజలు గమనిస్తున్నారన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో జగన్‌రెడ్డి మీద ఏ విధమైన కేసులూ బనాయించలేదని గుర్తు చేశారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ గురువారం సాయంత్రం నాలుగు గంటలకు సప్తగిరి సర్కిల్ నుంచి ఆర్ట్స్ కళాశాల ఎన్టీఆర్ విగ్రహం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నామని, పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. బుధవారం నిర్వహించిన దీక్షలో 48, 49, 50 డివిజన్ల కు చెందిన నాయకులతో పాటు బీసీ నేతలు పాల్గొన్నారు. డాక్టర్ కొండయ్య నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు. వీరి దీక్షలకు జనసేన పార్టీ అనంతపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి టిసి.వరుణ్, మహిళా నాయకురాలు పగిడాల శ్రీలత, కుమ్మర నాగేంద్ర, మేదర వెంకటేశులు, హేసేన్, అంజి, ఆదినాయక్ మద్దతుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిసి.వరుణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలనను సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సరైన ఆధారాలు లేకుండా చంద్రబాబును అరెస్టు చేయడం దారుణం అన్నారు. మరో 6 నెలల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని, ఇప్పుడు అకృత్యాలను సాగిస్తున్న వారినెవరినీ వదలబోమని హెచ్చరించారు. టిడిపి రాష్ట్ర నాయకులు ఆదినారాయణ, దేవళ్లమురళి, గాజుల ఆదెన్న, గౌస్‌మొద్దీన్, నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు డిష్ నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, నటేష్ చౌదరి, మాజీ కార్పొరేటర్ పరిమిరాజారావు, జిల్లా నాయకులు బంగి నాగ, నగర అధ్యక్షురాలు విజయశ్రీ రెడ్డి, సంఘ తేజస్విని, సరళ, జానకి దీక్షలకు మద్దతుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుల్లె శివ బాల, కార్పొరేషన్ మాజీ చైర్మన్ గాండ్ల విశాలాక్షి, దళవాయి రమాదేవి, టిడిపి జిల్లా బీసీ ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీ నరసింహులు, బెస్త షణ్ముఖ, కడియాల కొండన్న, వడ్డే పుల్లన్న పాల్గొన్నారు.



అనంతపురంలో చంద్రబాబుకు మద్దతుగా నిర్వహించిన రిలేనిరాహార దీక్షల్లో పాల్గొన్న టిడిపి, జనసేన నాయకులు

వినాయక నిమజ్జనంలో అపశృతి

నీటికుంటలో పడి యువకుడి మృతి

బత్తలపల్లి : మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో వినాయక నిమజ్జనంలో ఆపశృతి చోటు చేసుకుంది. నీటి కుంటలో పడి బాలిగొండ విజయ్ (18) అనే యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు...ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన బొలిగొండ లక్ష్మన్న, లింగమ్మ దంపతుల కుమారుడు విజయ్ వినాయక చవితి పండుగను పురష్కరించుకుని గ్రామంలో స్నేహితులతో కలిసి వినాయకుని విగ్రహం ఏర్పాటు చేశారు. మూడు రోజులు పాటు స్నేహితులతో కలిసి సందడి చేసుకున్నారు. బుధవారం సాయంత్రం వినాయకుని విగ్రహాన్ని ఊరేగింపుగా గ్రామ సమీపంలోని చెరువు వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ చెరువు కుంటలో వినాయకుని విగ్రహం నిమజ్జనం చేస్తుండగా అదుపు తప్పి విజయ్ కుంటలో పడిపోయాడు. బురదలో ఇరుక్కుపోవడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. స్నేహితులు రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మృతుడు అనంతపురంలోని ఓ ప్రవేట్ కళాశాలలో ఇంటర్ చదువుకుంటున్నాడు. ఉన్న ఒక్కగానొక కుమారుడు మృత్యువాత పడడంతో మృతుని తల్లిదండ్రులు రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తొలగింపుల పరిశీలన పూర్తి : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో 06-01-2022 నుంచి 09-08-2023 వరకు జరిగిన 96,153 ఓటరు తొలగింపులు అన్నింటినీ పున్ణపరిశీలన పూర్తి చేశామని కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టర్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో స్పెషల్ సమ్మర్ రివిజన్ - 2024, పోలింగ్ స్టేషన్‌ల రేషనలైజేషన్ తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పున్ణపరిశీలనలో భాగంగా తొలగింపులను బిఎల్‌ఒలు 100 శాతం క్లెయిమ్స్ పున్ణపరిశీలన పూర్తి చేశారన్నారు. క్షేత్రస్థాయిలో రాజకీయ పార్టీల నాయకుల దృష్టికి వచ్చినా తమకు తెలియజేయాలని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఈనెల 21వ తేదీనాటికి పోలింగ్ స్టేషన్ ల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, ఎన్నికలు విభాగం సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి రూ. 2 లక్షల చెక్కు అందజేస్తున్న కాపు భారతి

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

రాయదుర్గం : పట్టణంలోని 32వ వార్డుకు చెందిన గోపి భార్య సుజాతకు సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 2 లక్షల చెక్కును బుధవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి అందజేశారు. గతంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గోపి మృతి చెందగా అతడి కుటుంబానికి సిఎం సహాయ నిధి ద్వారా రూ. 2 లక్షలు మంజూరైంది. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, కౌన్సిలర్లు కొంతం దివాకర్, గోవిందరాజులు, డిష్ గోవింద, నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

23న మెగా రక్తదాన శిబిరం

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23 తేదీ మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డా. రఘురామ్మూర్తి బుధవారం తెలిపారు. విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని 74-ఉడేగోళం గ్రామంలో ఈ నెల 18వ తేదీ లింగారెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద బుధవారం రూ. 10వేలను ఆయన భార్య మౌనికకు అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి వేణు తెలిపారు.

సిడిమాను ఉత్సవం

రాయదుర్గం : మారెమ్మ జాతర సందర్భంగా పట్టణంలో బుధవారం సిడిమాను ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కోటలోని మారెమ్మ, నేసేపేటలోని దండు మారెమ్మ, ఓబుళాచారి రోడ్డు వద్ద ఉన్న కొల్లాపురమ్మ ఆలయాల వద్ద సిడిమానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సిడిమాను ఉత్సవంలో దీక్షలో ఉన్న వ్యక్తి చేతిలో కత్తి ధరించి తొమ్మిది ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

శింగనమల : మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామంలో టిడిపి సీనియర్ కార్యకర్త బడ దాసరి వీరనాగన్న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆ గ్రామం వెళ్లి మృతుని కుటుంబానికి రూ. 10వేలు అందజేసి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బండి పరశురాం, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, కాయల సురేష్, గుమ్మేపల్లి రంగస్వామి, సతీష్ రాయల్, సోమశేఖర్, తదితరులు ఉన్నారు.

23న తలనీలాల వేలం

గుత్తి : మండల పరిధిలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాల సేకరణ హక్కు కోసం ఈ నెల 23వ తేదీ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.దేవదాసు పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో జరిగే బహిరంగ వేలం పాటకు ఆసక్తి కలిగిన వారు రూ. 20వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని ఆయన తెలిపారు.

కెవికెలో అందుబాటులో విత్తనాలు

కళ్యాణదుర్గం : స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం(కెవికె)లో పప్పుశనగ నూతన వంగడాలకు చెందిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్త రాధాకుమారి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నంద్యాల గ్రామ్-776 వంగడం తో పాటు ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్ పౌడర్ కూడా అందుబాటులో ఉందన్నారు. ఈ వంగడం వర్షాధారంగా ఎకరాకు 8-10 క్వింటాళ్లు, నీటి సరఫరా ఉన్న పొలాల్లో 10-12 క్వింటాళ్లు పండుతుందన్నారు. ఈ పంట కోత సమయంలో మిషన్ అందుబాటులో ఉంటుందన్నారు. విత్తనం ధర రూ. 9500 గా నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 77025 44492 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అవయవదాత కుటుంబానికి 'నిత్యసురభి' చేయూత

అనంతపురం : అవయవ దానం ద్వారా నలుగురికి ప్రాణం పోసిన జగదీష్ కుటుంబానికి నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. సాయి ఆదిత్య కన్స్ట్రక్షన్ అధినేత పురుషోత్తమ మురళీకృష్ణ సౌజన్యంతో ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్. ఎస్.నిర్మలమురళి రూ. 10వేల నగదు, రూ. 10 వేల విలువ చేసే సరుకులను జగదీష్ భార్య రోజాకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ జగదీష్ కూలి పని చేస్తూ ప్రమాదం బారిన పడటం బాధాకరమని, అయితే తాను చనిపోతూ నలుగురికి జీవం పోసిన ఆదర్శవంతుడు జగదీష్ అని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కవిన్ ఆదిత్య, జగదీష్ తండ్రి నరసింహులు పాల్గొన్నారు.



జగదీష్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న 'నిత్యసురభి' ట్రస్టు సభ్యులు

కరువు మండలాలుగా ప్రకటించాలి

సిపిఎం, రైతు, వ్యకాసం ఆధ్వర్యంలో సచివాలయాల్లో వినతులు

ప్రజాశక్తి-ఉరవకొండ :

ఖరీఫ్ సీజన్-2023లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50 వేలు పరిహారం చెల్లించాలని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని నాల్గవ సచివాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండను కరువు మండలంగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పంట సాగు చేసి నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ. 50 వేలు, సాగు చేయని రైతుకు ఎకరాకు రూ. 30వేలు, వ్యవసాయ కార్మికుల జీవనోపాధికి కుటుంబానికి రూ. 25 వేలు, ఆత్మహత్య చేసుకున్న రైతు, కౌలు రైతుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 14 రకాల నిత్యావసర సరుకులు, వ్యవసాయానికి 9 గంటల నిరంతర ఉచిత విద్యుత్, స్మార్ట్ మీటర్ల రద్దు, రబీ సీజన్‌లో 90 శాతం సబ్సిడీపై పప్పుశనగ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శీనప్ప, రామాంజనేయులు నాయక్, తదితరులు పాల్గొన్నారు.



పుట్లూరు సచివాలయంలో అర్జీ అందజేస్తున్న రైతు, వ్యకాసం నాయకులు

పుట్లూరు : పుట్లూరును కరువు మండలంగా ప్రకటించి రైతుల అప్పులు మాఫీ చేసి కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం మండలంలోని ఐదారు సచివాలయాల్లో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సం ఘం ఆధ్వర్యంలో అర్జీలు సమర్పించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ సాగు 9.15 లక్షల ఎకరాలు కాగా 6.22 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయన్నారు. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో 210.1 మి.మీకు గానూ 135.1 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైందన్నారు. దీంతో మొక్కజొన్న, కంది, ఆముదం, వేరుశనగ, తదితర పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, రైతు సంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్యకాసం మండల అధ్యక్ష, కార్యదర్శులు టి.పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, కెవిపిఎస్ నాయకులు నాగభూషణం, రాజు, దస్తగిరి, రైతులు, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో సచివాలయంలో వినతిపత్రం ఇస్తున్న సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని 29వ వార్డు రాజ విద్యాశ్రమం వద్ద సిమెంటు రోడ్డు నిర్మాణానికి బుధవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సిసి రోడ్డు నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరైనట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్ యాదవ్, వలిబాషా, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, కౌన్సిలర్లు గోవిందరాజులు, దేవరాజ్, గోవిందా, శ్రీనివాసరెడ్డి, లావణ్య, కో ఆప్షన్ సభ్యులు నజీర్, గుమ్మఘట్ట జడ్పిటిసి మహేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, గృహ నిర్మాణ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే కాపు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప

పేదలకు భరోసా 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-ఉరవకొండ

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా అని ఎంపిపి కరణం పుష్పావతిభీమిరెడ్డి, సర్పంచి సుశీల ఉమాశంకర్ పేర్కొన్నారు. విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్లు గ్రామంలో బుధవారం వారు ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అక్టోబర్ 4వ తేదీ గడేకల్లు జడ్పి హైస్కూల్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది శివరామకృష్ణ, సుగుణ, పర్జహాన్, ఆశా, అంగన్వాడీ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



గడేకల్లులో జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి, సర్పంచి

గుమ్మఘట్ట : మండల పరిధిలోని కలుగోడు గ్రామంలో బుధవారం డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ కలుగోడు గ్రామంలో ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు రెండు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి యాప్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. సమస్యలు ఉన్న వారి కోసం అక్టోబర్ 4వ తేదీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 120 ఇళ్లు సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను గుమ్మఘట్ట మండలంలో ఈ నెల 30 నుంచి అక్టోబర్ 26వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్స్ బాలాజీ నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మురళీధర్, పిహెచ్ఎన్ నాగరత్నాలు, సూపర్‌వైజర్ ఆది బాయమ్మ, ఎఎన్ఎం రాజమ్మ, ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మి, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



కలుగోడులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం

ఎపి ఎస్‌పిడిసిఎల్ టెక్నికల్ డైరెక్టర్ సుబ్బరాజు

ప్రజాశక్తి-గుత్తి

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందిస్తామని ఎపి ఎస్‌పిడిసిఎల్ సాంకేతిక సంచాలకులు సుబ్బరాజు పేర్కొన్నారు. ఆయన బుధవారం గుత్తి డివిజన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 8 అదనపు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే వాటి నిర్మాణం పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతిపాదనలు పంపితే సబ్ స్టేషన్లలో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. గుత్తి సెక్షన్‌ను విభజిస్తామన్నారు. డివిజన్ పరిధిలో లైన్‌మెన్ల కొరత ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఖాళీల భర్తీకి చర్యలు చేపడతామన్నారు. విద్యుత్ బకాయిలను జరిమానాలతో సహా వసూలు చేస్తామన్నారు. ఆయనతో పాటు ఇఇ రాజశేఖర్, ఎఇ శ్రీకుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రప్రసాద్, తదితరులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎపి ఎస్‌పిడిసిఎల్ సాంకేతిక సంచాలకులు సుబ్బరాజు

వృద్ధులను కలవరపెడుతున్న మతిమరుపు

ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల కాలంలో వృద్ధులను మతిమరుపు(ఆల్జీమర్స్ వ్యాధి) ఎక్కువగా కలవరపెడుతోందని అనంతపురం నగరానికి చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ పేర్కొన్నారు. ఇది వృద్ధుల(60 ఏళ్లు పైబడిన వారు)లో కనబడే మెదడు జబ్బు. రక్తనాళాల్లో రుగ్మత వల్ల గుండె వ్యాధి ఎలా వస్తుందో మెదడు లోని కణాలు క్షీణిస్తే ఆలోచనలు, మాటలు, తెలివి తేటలు, జ్ఞాపకశక్తి, భావోద్వేగాలు, ప్రవర్తనలో మార్పులు వస్తాయన్నారు. ఈ లక్షణాలు కనపడడానికి 20 ఏళ్ల ముందే వ్యాధి మొదలవుతుందన్నారు. ఈ వ్యాధితో దేశంలో సుమారు 8.8 మిలియన్ల మంది అంటే 7.4 శాతం బాధపడుతున్నారన్నారు. మెదడులో ఎక్కువ కణాలు దెబ్బ తిని లక్షణాల తీవ్రత పెరిగి చివరి దశలో వారి పనులు కూడా వారు చేసుకోలేకపోతారన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేక తప్పిపోవడం, ఈ మధ్య జరిగిన విషయాలు, పేర్లు, సంభాషణలు మరచి పోవడం, నిరాసక్తత, కుంగుబాటు, గందరగోళం, ప్రవర్తనలో మార్పు, పదే పదే ప్రశ్నించడం, తదితర లక్షణాలు ఉంటాయన్నారు. సాధారణంగా 65 ఏళ్లు దాటిన వారిలో ఈ వ్యాధి వస్తుంది. ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరు, ప్రతి 10మంది పురుషుల్లో ఒకరు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. రక్తపోటు, షుగర్, ఊబకాయం, అధిక కొలెస్ట్రాల్, గుండె సంబంధిత వ్యాధులు, పొగతాగుట, శారీరక శ్రమ లేకుండుట, పోషకాహార లోపం ఈ వ్యాధి రావడానికి కారణాలన్నారు. కావున పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు, చేపలు, మాంసం, నట్స్, ఆలీవ్ ఆయిల్ తీసుకోవాలన్నారు. శారీరక వ్యాయామం, పని చెయ్యడం, జ్ఞాపకశక్తి పెంపొందించే వ్యాయామం, సంగీతం, కళల ఆధారిత చికిత్స పొందాలన్నారు. వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడాలి. ఈ వ్యాధిగ్రస్తుల పట్ల కుటుంబ సభ్యులు ఓర్పు, సహనం, ప్రేమతో వ్యవహరించాలి.



డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్



కళ్యాణదుర్గంలో రిలే దీక్షలో పాల్గొన్న ఉన్నం హనుమంతరాయచౌదరి, టిడిపి నాయకులు

జగన్ అప్రజాస్వామిక వాది : ఉన్నం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

సిఎం జగన్ ఒక అప్రజ్వామిక వాది అని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కనుమరుగైపోయిందని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా స్థానిక వాల్మీకి సర్కిల్‌లో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం కూడా కొనసాగాయ. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వా మ్యం ఏమాత్రం లేదని, అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. వైఎస్ఆర్ హయాంలో కూడా చంద్రబాబుపై అనేక కేసులు మోపారని, అందులో ఏ ఒక్కటీ నిరూపించలేక పోయారన్నారు. వచ్చేది టిడిపి ప్రభుత్వమేనని, అక్రమ అరెస్టుకు కారణమైన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదని, శాఖాపరమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మోరేపల్లి మల్లికార్జున, ఉన్నం మారుతి, రామ్మోహన్‌చౌదరి, వైపి.రమేష్, శ్రీనివాసరెడ్డి, గోళ్ల వెంకటేశులు, శివన్న తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పట్టణంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల టిడిపి మైనార్టీ విభాగం నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ నిజాయితీపరుడైన చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నించిన వారిపై కూడా కేసులు పెట్టడం, జైలుకు పంపుతూ సిఎం జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. దీక్షలో ముస్లిం మైనార్టీ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఉరవకొండలో దీక్షా శిబిరంలో పాల్గొన్న టిడిపి నాయకులు

సర్పంచుల నిధులు, విధుల కోసం పోరాటం

ప్రజాశక్తి-శింగనమల

సర్పంచుల విధులు, నిధుల కోసం చేపట్టిన తమ పోరాటం ఆగదని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ సభ్యులు డేగల కృష్ణమూర్తి స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో పంచాయతీరాజ్(పిఆర్) ఛాంబర్ జాతీయ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షు రాలు వాసుపల్లి లక్ష్మిముత్యాలరావు, పిఆర్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. కేంద్రం నిధులను దారి మళ్లించడన్ని తీవ్రంగా ఆక్షేపించారు. పిఆర్ నిధులు లేనందున రాష్ట్రంలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. నిధులు లేక పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని, ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం విడుదల చేసిన నిధులను పంచాయ తీలకు విడుదల చేయాలని, లేనిచో విడతల వారీగా ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల నాగభూషణం ముత్యాలప్పనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గుత్తి : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. స్వచ్ఛతా లీగ్-2, గుత్తి గ్రీన్ గన్నర్స్, సఫాయి మిత్ర సురక్ష షివిర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో మున్సిపల్ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. స్వచ్ఛ గుత్తికి మున్సిపాలిటీ వాసులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, ఎఇ వి.రవికుమార్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



గుత్తిలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ చేపట్టిన మున్సిపల్ అధికారులు

బెళుగుప్ప మండల వైసిపి కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-బెళుగుప్ప

వైసిపి మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న ప్రకటించారు. బెళుగుప్పలో ఎంపిపి పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సింగిల్‌విండో ప్రెసిడెంట్ శివలింగ విలేకరుల సమావేశంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యుల పేర్లను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండల అధ్యక్షుడిగా బోయ మచ్చన్న, ఉపాధ్యక్షులుగా కరుణాకర్, దేవనాథ్‌రెడ్డి, ట్రెజరర్‌గా ప్రసాద్, జనరల్ సెక్రటరీలుగా రామేశ్వర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, సోంపల్లి అశోక్, సెక్రటరీలుగా ఫక్రుద్దీన్, నాగేంద్ర, ఎల్లమ్మ, గోపాల్, వెంకటరెడ్డి, తిప్పేస్వామినాయక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా గోపాల్, గంగాధర్, ఎర్రిస్వామి, హనుమంతరాయుడు, యశోదమ్మ, చిన్న దేవమ్మ, శంకర్‌రెడ్డి, కృష్ణ, నాగిరెడ్డి, భక్తవత్సలం, మారుతి, గీత, చిత్తప్ప, అంజనమ్మ, శంకర్ నాయక్‌లను నియమించారు. సమావేశంలో జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు బోయ మచ్చన్న, జడ్పిటిసి భర్త త్రిలోక్‌రెడ్డి, రామనేపల్లి, నక్కలప్ల సర్పంచులు రమేష్, రామిరెడ్డి, నాయకులు కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

నేరాలు ఘోరాలు

బైక్, వ్యాన్ ఢీకొని యువకుడు మృతి

రాయదుర్గం : ద్విచక్ర వాహనం, వ్యాన్ ఢీ కొనడంతో ఓ యువకుడు మతి చెందిన సంఘటన బుధవారం పట్టణ శివారు లో చోటుచేసుకుంది. మండల పరిధిలోని కొంతానపల్లి గ్రామానికి చెందిన ఉపేంద్ర(30), ఓబులేసు బేల్దారి పని చేసే వారు. వీరు ద్విచక్ర వాహనంపై కర్నాటకలోని మొలకాల్మూరు వెళ్లి తిరిగి వస్తుండగా రాయదుర్గం నుంచి కర్నాటక వైపు వెళ్తున్న ఓమ్నీ వ్యాన్ సాయంత్రం పట్టణ శివారులోని పై తోట జాతీయ రహదారి వద్ద ఢీకొంది. ఈ ఘటనలో ఉపేంద్ర అక్కడికక్కడే మృతిచెందగా ఓబులేసు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతిచెందిన ఉపేంద్ర

అధిక వోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

రాయదుర్గం : పట్టణంలోని 27వ వార్డు కలైగార్ వీధిలో విద్యుత్ అధిక ఓల్టేజీ వల్ల సుమారు 30 ఇళ్లలో అనేక గృహోపకరణాలు కాలిపోయాయి. మంగళవారం రాత్రి అధిక ఓల్టేజీ సరఫరా కావడం వల్ల వీధిలోని పలు ఇళ్లలో ఫ్రిజ్‌లు, టివిలు, నీటి మోటార్లు, మొబైల్ ఫోన్లు, ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. కొన్ని ఇళ్లలో ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయి పెద్దగా శబ్దం రావడం, దట్టమైన పొగ రావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ అధికారులు స్పందించి తమకు జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో గోదాములో మంటలు

గుత్తి : పట్టణంలోని సుల్తానియా ఏజెన్సీకి చెందిన ఎలక్ట్రానిక్స్ వస్తువుల గోడాము బుధవా రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానిక అనంతపురంలో రోడ్డులో ఉన్న గోదాములో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు వ్యాపించి ఎసిలు, వాషింగ్ మిషన్లతో పాటు బ్యాటరీలు, సెల్ఫ్ మోటార్లు మంటల్లో కాలి బూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి మంటలను అదుపు చేయించారు. ప్రమాదంలో రూ. 7 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

రస్తా విషయంలో గొడవ.. కేసు నమోదు

పుట్లూరు : తాడిపత్రి మండల పరిధిలోని కొనుగుంటపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణరెడ్డి, అతని కొడుకు ప్రవీణ్‌కుమార్ పుట్లూరు గ్రామ పొలాల్లో రస్తా విషయంలో అదే గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి కొడుకు విశ్వనాథ్‌రెడ్డితో బుధవారం గొడవ పడి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పుట్లూరు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై బుధవారం నగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ఎం.గౌతమికి వినతి పత్రం అందజేశారు. వెంకట నారాయణ మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పేర్కొంటూ సంక్షేమ, అభివృద్ధి పథకాలు రద్దు చేసిన ప్రభుత్వం, వారి తరహాలో వేతనాలు, ఇతర సౌకర్యాలు ఇవ్వమంటే కుంటి సాకులు చెబుతుందని మండిపడ్డారు. ఇకనైనా వారిని రెగ్యులరైజ్ చేయాలని, ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించి ఇవ్వడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆటో కార్మికుల సమగ్రం చట్టం చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. ఈ చలానా రద్దు చేయాల ని, ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, నగర అధ్యక్షులు ఎర్రిస్వామి, రాయుడు, పోతులయ్య, మల్లికార్జున, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

తుంపెరలో మురుగునీరు మళ్లింపు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని తుంపెర గ్రామం ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డుపై నిత్యం మురుగునీరు నిలవడంతో కాలనీ వాసులు, విద్యార్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై తుంపెర ఎస్సీ కాలనీలో సమస్య పరిష్కరించాలని బుధవారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం రావడంతో స్పందించిన ఎంపిడిఒ దివాకర్ పంచాయ తీ కార్యదర్శి, స్థానికులతో మాట్లాడి రోడ్డుపై నిలిచిన మురుగునీటి పక్కకు మళ్లించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరించడానికి డోజర్ అవసరమవుతుందని ఒకట్రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరించి కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా చేస్తామని ఎంపిడిఒ తెలిపారు.



పుట్లూరులో గణనాథులను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

నిమజ్జనానికి తరలిన గణపయ్యలు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

వినాయక చవితి సందర్భంగా మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను బుధవారం సాయంత్రం డప్పు వాయిద్యాలు, భక్తజన సందోహం మధ్య నిమజ్జనానికి తరలించారు. విగ్రహాల శోభాయాత్రలో భక్తులు గణపతి బప్ప మోరియా, జై గణేశా జైజై గణేశా అంటూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. రెడ్డిపల్లి గ్రామంలో గణపయ్య విగ్రహాన్ని మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించి గ్రామ సమీపంలోని నీటి కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.



నిమజ్జనానికి ట్రాక్టర్‌లోకి విగ్రహాన్ని తీసుకెళ్తున్న ప్రజలు

ఉరవకొండ : మండలంలో గణేశ్ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో వినాయకుని విగ్రహాలను కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆనందోత్సాహాల మధ్య పెన్నహోబిలం, హంద్రీనీవా, పిఎబిఆర్, ఎంపిఆర్ డ్యాం, తదితర ప్రాంతాల్లో గణనాథుల విగ్రహాలను నిమజ్జనం చేశారు.

శింగనమల : మండల వ్యాప్తంగా వాడవాడలా, వీధి వీధినా వెలసిన మండపాల్లో మూడు రోజుల పాటు కుడుములు, ఉండ్రాళ్లను గణేశునికి నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. బుధవారం సాయంత్రం గణనాథులను గ్రామాల వీధుల గుండా డప్పు వాయిద్యాలు, డిజె సందడి నడుమ జన సమూహంలో రంగులు చల్లుకుంటూ ఊరేగించారు. అనంతరం సమీప కుంటలు, చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

పుట్లూరు : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా వినాయకునికి పూజలు నిర్వహించి గ్రామాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి సమీప కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.